# సారస్వత సౌరభం

ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్

ఎమెస్కో

# విషయక్రమం


| | | |
|---|---|---|
| | ముందుమాట– ఎ.కృష్ణారావు | |
| 1. | సిద్ధాంతాలకతీతంగా శ్రీశ్రీ | 11 |
| 2. | హిందీ సాహిత్యంలో ఉన్నత శిఖరం కేదార్‌నాథ్ | 16 |
| 3. | ఆయన జీవితం వడగాడ్పు, కవిత్వం వెన్నెల | 20 |
| 4. | ఒక కృష్ణ శాస్త్రి, ఒక శ్రీశ్రీ కలిపితే సుమిత్రానందన్ | 25 |
| 5. | మృత్యురహస్యాన్ని ఛేదించిన కవి బైరాగి | 30 |
| 6. | ప్రజా జీవితమే నిరాలాకు పాఠశాల | 56 |
| 7. | తెలుగు సాహిత్యంలో ప్రజా దృక్పథం | 61 |
| 8. | యుగకర్త జయశంకర ప్రసాద్ | 69 |
| 9. | పెద్దల సభలో తెలుగు పెద్ద | 76 |
| 10. | నవకవితా రవి 'దినకర్' | 83 |
| 11. | అవధాన సార్వభౌముడు గరికిపాటి | 88 |
| 12. | బిహారీ కవిత్వంలో కృష్ణ భక్తి | 92 |
| 13. | అపూర్వ రచయిత 'అంపశయ్య' నవీన్ | 100 |
| 14. | హిందీ పోతన సూరదాస్ | 107 |
| 15. | తెలుగు వెలుగులు ఆరకుండా చూద్దాం | 115 |
| 16. | ఆధునిక దృక్పథానికి నాంది నవ్య కవిత్వం | 120 |
| 17. | మహాపథికుడు ఆదినారాయణ | 127 |
| 18. | కర్మకాండలపై గొడ్డలిపెట్టు కబీర్ వాణి | 129 |
| 19. | అసలైన మహాకవి గోరటి వెంకన్న | 138 |
| 20. | హిందీ సాహిత్యంలో భక్తి యుగం | 143 |

21. అజరామరం ఆయన సంగీతం 150

22. హిందూ ప్రతినిధి గోస్వామి తులసీదాస్ 155

23. భారతీయ తాత్త్వికతకు ప్రతిరూపం సచ్చిదానంద మూర్తి 161

24. హిందీ సాహిత్యంలో ఛాయావాదం 166

25. తెలంగాణ సాహిత్యం తరగని గని 172

26. బైరాగి మానస పుత్రుడు ఆదేశ్వర రావు 176

27. మొక్కపాటి సృష్టించిన సజీవ సాహిత్యం 181

28. సరిహద్దులు దాటి విస్తరించిన తెలుగు కలం 184

29. జర్నలిజానికి గౌరవం తెచ్చిపెట్టిన చందూర్ దంపతులు 189

30. ప్రతిభా త్రిమూర్తి కృష్ణుడు 194

# సిద్ధాంతాలకతీతంగా శ్రీశ్రీ

మనసు నిస్పృహగా ఉన్న వేళ, అంతా జడత్వం పరివ్యాప్తమైన వేళ, చెట్టుపై ఆకులు కూడా కదలని దిగ్బంధ వాతావరణంలో మనను మనం జాగృతం చేసుకోవడానికి ఒక్క వ్యక్తి కవిత్వం చదివితే చాలు. తెలుగు సాహిత్యంలో స్తబ్ధతను ఒక్కసారిగా భగ్నం చేసి కొత్త లోకాలకు తీసుకువెళ్లిన మహా కవి ఆయన. ఆయనను మనం మరిచిపోదామన్నా మరిచిపోలేం. మన భావాల్లో, భాషలో, కదలికలో, మనం చదివే అక్షరాల్లో, మన అంతర్గత, బహిర్గత ప్రాణంలో తచ్చాడే కవి ఆయన. ఆయన ఎవరో కాదు శ్రీరంగం శ్రీనివాసరావు. ఆయనే శ్రీశ్రీ.

మంత్రులు కనీసం ప్రమాణ స్వీకారాన్ని కూడా సరిగ్గా ఉచ్చరించని నాడు, తెలుగు భాషకు పుట్టినిల్లని చెప్పుకునే రాజధాని శంకుస్థాపన ఫలకం కూడా తెలుగులో రాయించలేని దుస్థితిలో కనపడిన నాడు. తెలుగు విశ్వవిద్యాలయం అధ్యాపకులు జీతాలు లేకుండా తమ భవిష్యత్తు ఏమిటో తెలియకుండా ఆక్రందిస్తున్ననాడు. శతాబ్దం తొలి రోజుల్లో భాషకు ఆధునికతను భావాలకు పురోగతిని ప్రసాదించిన అడుగుజాడ గురజాడ వారసులు రోడ్డున పడిపోయిన నాడు, తెలుగు వారు దేశ రాజధానిలో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ మన పరువును బజారుకు ఈడ్చిన నాడు మనలో నిరాశా నిస్పృహల చీకట్లని తొలగించి మనను చైతన్యవంతం చేసే కవి శ్రీశ్రీ. మనదీ ఒక బతుకేనా, కుక్కల వలె, నక్కల వలె... మనదీ ఒక బతుకేనా సందులలో పందుల వలె... అని ఆత్మశోధన చేసేందుకు అవకాశం కల్పించాడు శ్రీశ్రీ.

అందుకే శ్రీశ్రీ కవిత్వాన్ని తూచే రాళ్లు తన దగ్గర లేవన్నాడు చలం. తూచవద్దు, అనుభవించి పలవరించమన్నాడు శ్రీశ్రీ. ఒక కుళ్లు సమాజాన్ని చూసి, అస్తవ్యస్త వ్యవస్థల్ని చూసి, దుర్మార్గాల్ని, దౌర్భాగ్యాల్నీ చూసి మనలో ఒక ప్రతిఘటనా స్వరం ఉప్పొంగుతుంది. అప్పుడు ప్రశ్నించాలనే తత్త్వాన్ని మనలో పురికొల్పుతుంది శ్రీశ్రీ

కవిత్వం. ప్రశ్నించకుండా ఉండలేని వారు దిక్కుమాలిన చావు చావమని కూడా శ్రీశ్రీ కవిత్వం అవహేళన చేస్తుంది. ఎముకలు కుళ్లిన, వయస్సు మళ్లిన సోమరులారా చావండి, నెత్తురు మండే శక్తులు నిండే సైనికులారా రారండి... అని శ్రీశ్రీ రాసిన మహాప్రస్థాన గేయం ఒక్కటి చదివితే చాలు మనకు అడుగు ముందుకు వేయాలనే అనిపిస్తుంది కాని వెనక్కు వేయాలనిపించదు.

మహాప్రస్థాన గేయం రాసింది 1934లో. అంటే ఇప్పటికి 86 ఏళ్ల క్రితం రాసిన కవిత్వం అన్నమాట. ఎనిమిది దశకాలే కాదు, శతాబ్దం గడిచినా, ఎన్నో శతాబ్దాలు గడిచినా మనలో ఒక నూతనోత్తజం తెప్పించే కవిత్వం మహాప్రస్థానం. ఆ పుటలు విప్పి చదివితే మనం ఎన్ని పునర్జన్మలెత్తినా మనకు చలం చెప్పినట్లు రాబందుల రెక్కల చప్పుడు, పయోధర ప్రచండ ఘోషం, ఝంఝానిల షడ్జధ్వానం మనలో ప్రకంపనలు రేకెత్తిస్తుంది. విని తట్టుకోగల చేవ ఉంటే ఈ పుస్తకం తెరవాలని అన్నాడు చలం. అవును. నేటితరంలో, ముఖ్యంగా మన నేతల్లో ఎంతమందికి శ్రీశ్రీ కవిత్వం విని తట్టుకోగల చేవ ఉంది? అవును. వారిలో చాలా మందికి శ్రీశ్రీ అన్నట్లు... నేడు ప్రపంచం ఎట్లాపోతేనేం? మీకెందుకు లెండి... అదృష్టవంతులు మీరు... వడ్డించిన విస్తరి మీ జీవితం... అందుకే వారిని శ్రీశ్రీ రోడ్డుమీద నిలబెట్టి ప్రశ్నించాడు. వారిని నగ్నస్వరూపులు చేసి వారి వికృత రూపాన్ని జనానికి తెలియజేశాడు. కొంతమంది కుర్రవాళ్లు పుట్టుకతో వృద్ధులు. పేర్లకీ , పకీర్లకీ, పుకార్లకీ నిబద్ధులూ... అని స్పష్టం చేశాడు. అదే సమయంలో కొంతమంది యువకులు, రాబోవు యుగపు దూతలు... పావన నవజీవన బృందావన నిర్మాతలు... అని కొత్త తరంపై ఆశను వెలిబుచ్చాడు.

శ్రీశ్రీ ఏ సిద్ధాంతానికీ, ఏ దృక్పథానికీ చెందిన కవి కాదు. శ్రీశ్రీ ఆధునిక తెలుగు సాహిత్యంలో ఒక విరాట్ స్వరూపం. తెలుగు జాతి శిరస్సున ధరించాల్సిన కిరీటం. "నేనొక దుర్గం... నాదొక స్వర్గం,అనర్గళం, అనితర సాధ్యం నా మార్గం..." అని శ్రీశ్రీయే స్వయంగా ప్రకటించాడు. ఆయనది ఏ కవిత్వం? కవితామతల్లిపై ఆయనదే అభిప్రాయం? ఆయనేమి నిర్వచించాడు? కవితా... ఓ కవితాలో ఆయన ఎన్ని దృశ్యాలు చూపించాడు? శిశువు నెడద నిడుకుని రుచిర స్వప్నాలను కాంచే జవరాలి మనఃప్రపంచపు టావర్తాలు, శిశువు చిత్రనిద్రలో ప్రాచీన స్మృతులూచే చప్పుడు,